సాక్షి
కుమురం భీం

సోమవారం ; 16 ; సెప్టెంబర్ ; 2024

గణపయ్యకు 108 నైవేద్యాలు



గణేశ్ నవరాత్రుల సందర్భంగా భక్తులు మండపాల వద్ద అన్నదానాలు, కుంకుమపూజలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని శ్రీవాసవి గణేశ్ మండలి ఆధ్వర్యంలో నెలకొల్పిన గణనాథుడికి భక్తులు ఆదివారం 108 రకాల నైవేద్యాలు సమర్పించారు. అర్చకులు రాజశేఖర్‌శర్మ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

– ఆసిఫాబాద్‌అర్బన్

న్యూస్‌రీల్

మంత్రిని కలిసిన ఆదివాసీ నాయకులు



మంత్రి సీతక్కకు వినతిపత్రం ఇస్తున్న ఆదివాసీ నాయకులు

బెజ్జూర్(సిర్పూర్): మారుమూల గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని బెజ్జూర్, పెంచికల్‌పేట్ మండలాలకు చెందిన పలువురు నాయకులు ఆదివారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కను హైదరాబాద్‌లో కలిశారు. బెజ్జూర్ మండలంలోని కుశ్నపల్లి నుంచి గూడెం(వయా సోమిని), హేటిగూడ నుంచి కమ్మర్‌గాం, కమ్మర్‌గాం నుంచి మురళీగూడ, పెంచికల్‌పేట్ మండలంలోని నందిగాం(వయా అగర్‌గూడ) గ్రామాలకు ప్రధాన రహదారులు, వంతెనలు లేక గిరిజన ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఏటా గిరిజన గర్భిణులు కాన్పు సమయంలో అవస్థలకు గురవుతున్నారని వివరించారు. గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బెజ్జూర్, పెంచికల్‌పేట్ ఆదివాసీ నాయకులు కొడప శంకర్, విశ్వేశ్వర్, రమేశ్, పార్శెటి ప్రభాకర్, లాలయ్య, కొడప పుల్లయ్య తదితరులు ఉన్నారు.

నిమజ్జన ఏర్పాట్లు పరిశీలన



సూచనలు చేస్తున్న సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని పెద్దవాగు వద్ద గణేశ్ నిమజ్జన ఏర్పాట్లను ఆదివారం రాత్రి కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ నిమజ్జనం చేసే ప్రదేశంలో ఎత్తుపల్లాలు ఉన్నాయని, మొరంతో సరిచేయాలని సూచించారు. గడువు సమీపిస్తున్న పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. తహసీల్దార్ కిరణ్, మున్సిపల్ మాజీ చైర్మన్ దస్తగిర్ తదితరులు ఉన్నారు.

'వందేభారత్' రాకపోకలపై అప్రమత్తత అవసరం



అవగాహన కల్పిస్తున్న జీఆర్పీ ఏఎస్సై మోహన్

రెబ్బెన(ఆసిఫాబాద్): సికింద్రాబాద్, నాగ్‌పూర్ మధ్య కొత్తగా సోమవారం నుంచి వందేభారత్ ఎక్స్‌ప్రెస్ సేవలు ప్రారంభమవుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బెల్లంపల్లి జీఆర్పీ ఏఎస్సై రాథోడ్ మోహన్ తెలిపారు. మండల కేంద్రంలోని ఆసిఫాబాద్ రోడ్ రైల్వేస్టేషన్ వద్ద ఆదివారం స్థానికులతోపాటు రాజకీయ పార్టీల నాయకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వందేభారత్ ఎక్స్‌ప్రెస్ వచ్చే సమయంలో ప్రజలెవ్వరూ ట్రాకు వైపు వెళ్లవద్దని సూచించారు. అలాగే పశువులను ట్రాక్ సమీపంలో మేపవద్దన్నారు. యువకులు అత్యుత్సాహంతో సెల్ఫీలు తీసుకునే ప్రయత్నాలు చేయవద్దన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సంతోష్, నాయకులు సుదర్శన్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీధర్, గంటుమేర, సోమశేఖర్, మహేశ్‌గౌడ్, చిరంజీవిగౌడ్, రాజేశ్ పాల్గొన్నారు.

మట్కా.. మాఫియా..!



కూలీలు, కార్మికులు మట్కాకు బానిసలుగా మారుతున్నారు. సంపాదించిన సొమ్మును ఆటలో పోగొట్టుకుంటున్నారు.

- వివరాలు 9లో ▸

మెడికిల్ దందా!



కౌటాల మండల కేంద్రానికి చెందిన ఓ చిన్నారి అనారోగ్యం బారినపడటంతో కుటుంబ సభ్యులు స్థానికంగా వైద్యం చేయించారు. నయం కాకపోవడంతో మంచిర్యాల పట్టణానికి చికిత్స కోసం తీసుకెళ్లారు. అక్కడి వైద్యుడు కౌటాలలో వినియోగించిన మందులు పరిశీలించి కుటుంబ సభ్యులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఇంత హెచ్చుస్థాయిలో యాంటీ బయోటిక్స్, మందులు చిన్నారికి ఇవ్వడం ఏంటని తల్లిదండ్రులను ఆయన మందలించాడు.

చింతలమానెపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి తరచూ కీళ్లనొప్పులతో బాధపడుతుండడంతో స్థానికంగా వైద్యం చేయించుకున్నాడు. నొప్పులు తగ్గుతుండడంతో తరచూ వైద్యం తీసుకున్నాడు. కొంతకాలానికి తీవ్రమైన జ్వరం రావడంతో కాగజ్‌నగర్ నుంచి కరీంనగర్ వెళ్లి పరీక్షలు చేయించుకున్నాడు. అక్కడ పరీక్షల్లో కిడ్నీ సంబంధిత వ్యాధులు బయటపడ్డాయి. పెయిన్ కిల్లర్స్, స్టెరాయిడ్స్ పరిమితి లేకుండా వినియోగించడంతో ఈ సమస్య తలెత్తినట్లు అక్కడి వైద్యులు వెల్లడించారు.

- గ్రామీణులపై వైద్యుల ప్రయోగం..
- విచ్చలవిడిగా మెడిసిన్ రాస్తున్న డాక్టర్లు
- జాడలేని నియంత్రణ శాఖలు
- ప్రమాదంలో ప్రజారోగ్యం

చింతలమానెపల్లి(సిర్పూర్): మెడిసిన్స్.. వ్యాధులు నయం కావడానికి వినియోగించే ఔషధమే అయినా పరిమితి దాటితే తీవ్ర ప్రమాదం.. అవగాహన లేక విచ్చలవిడిగా వినియోగిస్తున్న అనేక మందులు ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా గ్రామాల్లో సరైన వైద్యసేవలు అందుబాటులో లేవు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక కేంద్రాల్లో సరిపడా వైద్యులు లేకపోవడంతో పూర్తిస్థాయి వైద్యం కూడా అందడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

ఆదాయ వనరుగా మెడిసిన్

కొద్దిరోజులపాటు వైద్యుడి దగ్గర పనిచేస్తే చాలు.. లేదా మందుల దుకాణంలో పనిచేసినా కొంతమంది గ్రామాల్లో వైద్యుడిగా అవతారం ఎత్తుతున్నారు. మందులు, ఇంజక్షన్లు ఇచ్చేస్తున్నారు. నాలుగు అంకెల్లో సంపాదిస్తున్నారు... ఇదీ గ్రామీణ ప్రాంతాల్లో నేటి పరిస్థితి. వైద్యం ఆదాయం గడించే వృత్తిలా మారిపోయింది. గతంలో పట్టణ ప్రాంతాలకే పరిమితమైన మెడికల్ దుకాణాలు నేడు గ్రామీణ ప్రాంతాల్లోనూ పదుల సంఖ్యలో వెలిశాయి. రోగ నిర్ధారణ చేసే ల్యాబ్, మందుల దుకాణం, వైద్యం ప్రభుత్వ గుర్తింపు లేకుండానే నడుస్తున్నాయి. ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెడుతున్నాయి.

విచ్చలవిడిగా వినియోగం..

వైద్యం అందించే క్రమంలో కొంతమంది ఆర్‌ఎంపీలు ఆదాయం కోసం గ్రామాల్లో పరిమితి దాటి మందులను రోగులకు అంటగడుతున్నారు. డైక్లోఫెనాక్ వంటి నొప్పులు తగ్గించే స్టెరాయిడ్లు, బాక్టీరియా నాశనానికి వినియోగించే యాంటి బయాటిక్స్ వినియోగం పెరిగిపోయింది. అనుమతి లేని వైద్యులు చేసే వైద్యంతో శారీరకంగా రుగ్మతల బారిన పడే అవకాశం ఉంది. ఈ మందులతో రోగాలు కూడా ముదిరిపోతున్నాయి. రోగ నిరోధకశక్తి తగ్గి వ్యాధులు మందులకు లొంగని పరిస్థితికి రోగి చేరుకుంటున్నాడు. తాజాగా ప్రభుత్వం 156 రకాల మందులను నిషేధించింది. కానీ చాలా రకాల మందులను నేటికీ అనధికారిక వినియోగిస్తున్నారని తెలుస్తోంది. మహారాష్ట్ర నుంచి జిల్లాలోని సరిహద్దు మండలాల్లో పలువురు అనధికారికంగా వైద్యులుగా చలామణి అవుతూ విచ్చలవిడిగా మందులను ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా మందుల వినియోగంపై అవగాహన కార్యక్రమాలు తక్కువగా ఉన్నాయి. డ్రగ్స్ కంట్రోల్ అధికారి కేవలం ఒక్కరే విధుల్లో ఉన్నారు. డ్రగ్స్ వినియోగంపై తరచూ స్వచ్ఛంద సంస్థలు, వైద్యశాఖల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని వైద్య నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

నిపుణుల వద్దే చికిత్స తీసుకోవాలి

ప్రజలు ఎవరైనా రోగాల బారిన పడితే నిపుణుల వద్దే చికిత్స తీసుకోవాలి. స్టెరాయిడ్స్, యాంటీ బయాటిక్ లాంటి మందులను నిపుణులు అన్నిరకాల వైద్య పరీక్షలు రోగనిర్ధారణ అనంతరమే ఇస్తారు. వైద్యుల పర్యవేక్షణలో ఇలాంటి మందులు వినియోగించాలి. విచ్చలవిడిగా మందులు వినియోగిస్తే దుష్ప్రభావాలు ఉంటాయి.

– సందీప్ జాదవ్, ఎండీ పల్మనాలజీ, రిమ్స్ వైద్యులు

తనిఖీలు చేపడతాం

జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు పలు ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాం. మందుల వినియోగంపై జిల్లా అంతటా పరిస్థితులను పరిశీలించి అనుగుణంగా చర్యలు తీసుకుంటాం. మెడిసిన్ సంబంధిత నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తప్పవు. మందుల విక్రయాలు సంబంధిత వ్యవహారాలపై త్వరలో తనిఖీలు నిర్వహిస్తాం.

– అశ్విని, జిల్లా డ్రగ్ అధికారి

గణేశ్ నిమజ్జనానికి ఏర్పాట్లు



జిల్లా కేంద్రంలోని పెద్దవాగు వద్ద ఏర్పాట్లు

- నేటి నుంచి మూడు రోజులపాటు నిమజ్జనోత్సవం
- డీజేలకు అనుమతి లేదని పోలీసుల వెల్లడి

ఆసిఫాబాద్: గణేశ్ నిమజ్జనానికి జిల్లా కేంద్రంలోని పెద్దవాగు వద్ద మున్సిపల్ సిబ్బంది ఏర్పాట్లు చేశారు. తొమ్మిది రోజులుగా పూజలందుకున్న గణనాథులను సోమవారం నుంచి మూడు రోజులపాటు జిల్లా కేంద్రంలోని పెద్దవాగులో నిమజ్జనం చేయనున్నారు. ఇప్పటికే కలెక్టర్ వెంకటేశ్ దోత్రే జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి గణేశ్ మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. పెద్దవాగు వద్ద నిమజ్జన ప్రాంతంలో నీటి ఉధృతిని దృష్టిలో ఉంచుకొని మున్సిపల్ అధికారులు బారికేడ్లు ఏర్పాట్లు చేశారు. గజ ఈతగాళ్లను సైతం అందుబాటులో ఉంచారు. పెద్దవాగు వద్ద నిమజ్జనానికి అనుకూలంగా జేసీబీ, ట్రాక్టర్లతో చదును చేయించారు. దారిపొడవునా విద్యుద్దీపాలు ఏర్పాటు చేశారు. శాంతిభద్రతల దృష్ట్యా ఈ ఏడాది నిమజ్జనంలో డీజేలకు అనుమతి లేదని ఎస్పీ స్పష్టం చేశారు.

రూట్‌మ్యాప్ ఇలా..

నిమజ్జనం సందర్భంగా గణనాథుల శోభాయాత్ర పట్టణంలోని వివేకానంద చౌక్, గాంధీ చౌక్, పొట్టిశ్రీరాములు చౌక్ మీదుగా శివకేశవ మందిర్ వీధి, బ్రాహ్మణవాడ, రావులవాడ మీదుగా కొనసాగనుంది. ఆసిఫాబాద్ మండలంలో 112 వినాయకుడి విగ్రహాలు ఏర్పాటు చేయగా, పట్టణంలో సుమారు 50కి పైగా గణనాథులను ఏర్పాటు చేశారు. మూడు రోజులపాటు నిమజ్జనోత్సవం కొనసాగనుంది. గ్రామీణ ప్రాంతాల్లో చెరువులు, ఒర్రెలు, వాగుల్లో నిమజ్జనం చేసేందుకు పంచాయతీ అధికారులు ఏర్పాట్లు చేశారు.

మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కార్యాచరణ

గణేశ్ నిమజ్జనానికి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కార్యాచరణ సిద్ధం చేశామని ఆసిఫాబాద్ మున్సిపల్ కమిషనర్ భుజంగరావు తెలిపారు. నిమజ్జనం పురస్కరించుకొని పెద్దవాగు వెళ్లే రహదారికి మరమ్మతులు చేపట్టామని, లైటింగ్‌తోపాటు జనరేటర్ అందుబాటులో ఉంచామన్నారు. 30 మంది మున్సిపల్ సిబ్బంది విధులు నిర్వర్తిస్తారన్నారు. 20 మంది గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచామని తెలిపారు.

పోలీసుల ఆంక్షలు

జిల్లాలో నిమజ్జనోత్సవం ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసులు ఆంక్షలు విధించినట్లు ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలో గట్టి బందోబస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్సైలతో పాటు 80 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొంటారని వెల్లడించారు. ఊరేగింపు వాహనాలు విగ్రహాల ఎత్తుకు తగ్గట్టుగా నిర్దేశిత మార్గాల్లో వెళ్లాలని ఆయన సూచించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఊరేగింపులో ఎటువంటి డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఎవ్వరూ కూడా డీజేలను వినియోగించకూడదన్నారు. అనుమతి లేకుండా వినియోగిస్తే సీజ్ చేసి, నిర్వాహకులపై కేసు నమోదు చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు.

- నిమజ్జన వాహనంపై లౌడ్ స్పీకర్లు అమర్చకూడదు. ట్రాఫిక్ అంతరాయం కలిగించొద్దు.
- విగ్రహాన్ని తీసుకెళ్లే వాహనం ప్రార్థనా స్థలాల వద్ద నిలపకూడదు.
- ఊరేగింపులో కర్రలు, కత్తులు, మారణాయుధాలు, మండే పదార్థాలు, ఆయుధాలు తీసుకెళ్లకూడదు. బాణసంచా కాల్చరాదు.
- జెండాలు అలంకరణ కోసం ఉపయోగించే కర్రలు రెండడుగుల పొడవు మించొద్దు.
- ఊరేగింపులో ఎలాంటి రాజకీయ ప్రసంగాలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయొద్దు. నిమజ్జన ప్రాంతం వద్ద క్రేన్ ద్వారానే చెరువులో వేయాలి. పోలీసుల సూచనలు పాటించాలి.
- అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌రూరల్: ప్రజాబంధు, మాజీ ఎమ్మెల్యే దివంగత పాల్వాయి పురుషోత్తమరావు 25వ వర్ధంతి సందర్భంగా ఆదివారం పట్టణంలోని పటేల్ గార్డెన్‌లో నిర్వహించిన వైద్యశిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ప్రజాబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పురుషోత్తమరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పురుషోత్తమరావు ఆశయసాధన కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రజాబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎనిమిది వేల మందికి లయన్స్ క్లబ్ సహకారంతో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించామని తెలిపారు. ఈ వైద్యశిబిరంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సీతారాం, హృదయ సంబంధ వ్యాధుల నిపుణులు కిరణ్‌కుమార్, నరాల స్పెషలిస్టు అరుణ్ శేషు, కిడ్నీ వ్యాధుల స్పెషలిస్టు రాకేశ్, మూత్రాశయ సంబంధ వ్యాధుల స్పెషలిస్టు రేవంత్‌వర్మ, గ్యాస్ట్రోంటరాలజిస్టు శ్రీధర్, జనరల్ ఫిజిషియన్ సాయి వివేక్, జనరల్ సర్జన్లు రాజ్‌కుమార్, సుధాకర్, ఎముకల వైద్యనిపుణులు ఓంప్రకాశ్, శ్రావణ్‌కుమార్, ఈఎన్‌టీ వైద్యులు హారిక, కంటి స్పెషలిస్టు వెంకటేశ్, దంత స్పెషలిస్టు భానుప్రకాశ్, స్త్రీల వైద్యనిపుణులు జ్యోతి, నవ్యశ్రీ, మెడికల్ ఆఫీసర్లు క్రాంతి, అర్షిన్ తదితరులు పాల్గొన్నారు. సుమారు 2500 మంది రోగులను డాక్టర్లు పరీక్షించి ఉచితంగా ఈసీజీ, 2డీ ఈకో, అల్ట్రాసౌండ్, రక్త, మూత్ర పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. రోగులకు జ్యూస్ అందించడంతోపాటు అన్నదానం నిర్వహించారు.

నిమజ్జనోత్సవం ప్రశాంతంగా జరుపుకోవాలి

- ఎస్పీ డీవీ శ్రీనివాసరావు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

కాగజ్‌నగర్‌రూరల్: గణేశ్ నిమజ్జనోత్సవం ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు సూచించారు. కాగజ్‌నగర్ మండలంలోని గణేశ్ నిమజ్జన ప్రాంతమైన పెద్దవాగును ఆదివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. అలాగే పట్టణంలోని సమస్యాత్మక, సున్నితమైన ప్రాంతాలను పరిశీలించారు. గణేశ్ మండపాలను పరిశీలించి నిర్వాహకులకు సూచనలు చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి రికార్డులు పరిశీలించారు. పట్టణ పరిస్థితులను ఎప్పటిప్పుడు గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట డీఎస్పీ రామానుజం, పట్టణ సీఐ శంకరయ్య, రూరల్ ఎస్సై మహేందర్, తహసీల్దార్ కిరణ్ తదితరులు ఉన్నారు.

సృజనాత్మకత కలిగిన ప్రతిఒక్కరూ ఇంజినీరే..



నివాళులర్పిస్తున్న జీఎం శ్రీనివాస్

రెబ్బెన(ఆసిఫాబాద్): సృజనాత్మకత కలిగిన ప్రతిఒక్కరూ ఇంజినీరే అని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో ఆదివారం జాతీయ ఇంజినీర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జీఎం మాట్లాడుతూ సైన్స్ అంటేనే తెలుసుకోవడమని.. ఇంజినీరింగ్ అంటేనే సృష్టించడం అని అన్నారు. సింగరేణి సంస్థలో బొగ్గు ఉత్పత్తి ప్రక్రియ కొనసాగేందుకు అన్ని విభాగాలు ఎంతో అవసరమన్నారు. అందులో ఇంజినీరింగ్ విభాగం మరింత కీలకమని పేర్కొన్నారు. వృత్తి నైపుణ్యాలు మెరుగుపర్చుకుంటూ సంస్థకు సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌వోటూజీఎం రాజమల్లు, ఖైరిగూడ పీవో నరేందర్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, ఇతర విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఖాళీలతో సతమతం!

- అంగన్‌వాడీల్లో సిబ్బంది కొరత
- జిల్లాలో 98 టీచర్లు, 271 హెల్పర్ పోస్టులు ఖాళీ
- సర్దుబాటుతోనే నెట్టుకొస్తున్న వైనం
- కొత్త ఉద్యోగాల కోసం నిరుద్యోగుల ఎదురుచూపు



తిర్యాణి మండలంలోని ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రం

వాంకిడి(ఆసిఫాబాద్): గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంతో పాటు శిశువులకు టీకాలు వేయడం, పోలియోను అరికట్టడంలో ముఖ్యపాత్ర పోషించడం వంటి ప్రత్యేక కార్యక్రమాలను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నిర్వహిస్తున్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం పూర్వ ప్రాథమిక విద్య అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గ్రామీణ ప్రాంతాల్లో కీలకమైన అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల పోస్టులను ఏళ్ల తరబడి భర్తీ చేయడం లేదు. సమీపంలోని కేంద్రాల్లో పనిచేస్తున్న టీచర్లకు అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నారు. ఫలితంగా అంగన్‌వాడీ టీచర్లపై అదనపు భారం పడటంతోపాటు కేంద్రాలకు వచ్చే వారికి మెరుగైన సేవలందడం లేదు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో వందల సంఖ్యలో ఉన్న ఖాళీలతో పిల్లలు, గర్భిణులు, బాలింతలకు నష్టం జరుగుతోంది.

మొత్తం 973 కేంద్రాలు

జిల్లాలో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, సిర్పూర్(టి), జైనూర్, వాంకిడి ప్రాజెక్టుల్లో మొత్తం 973 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ప్రతీ అంగన్‌వాడీ కేంద్రానికి ఒక టీచర్, హెల్పర్ ఉండాలి. 973 కేంద్రాలకు ప్రస్తుతం 875 టీచర్లు, 702 మంది హెల్పర్లు పనిచేస్తున్నారు. ఐదు ప్రాజెక్టుల్లో 98 టీచర్ పోస్టులు, 271 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వం నుంచి కచ్చితమైన ప్రకటన విడుదల కాకపోవడంతో భర్తీపై సందిగ్ధం నెలకొంది. వందల పోస్టులు ఖాళీగా ఉండటంతో దరఖాస్తు చేసుకునేందుకు నిరుద్యోగులు కూడా ఆశగా ఎదురు చూస్తున్నారు. జిల్లాలో జైనూర్, సిర్పూర్(యూ), కెరమెరి, తిర్యాణి, లింగాపూర్ ప్రాంతాల్లో ఆదివాసీ గిరిజనులు అధికంగా ఉన్నారు. ఆయా మండలాల్లోని పీవీటీజీ ప్రాంతాల్లో చదువుకున్న మహిళలు చాలా తక్కువ మంది ఉన్నారు. గత నిబంధనల ప్రకారం అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్, ఆయాగా పనిచేయాలంటే స్థానికతను ఆధారంగా తీసుకునేవారు. వివాహ అనంతరం అంగన్‌వాడీ కేంద్రం ఉన్న గ్రామానికి చెందిన వారై ఉండాలి. మారుమూల ఆదివాసీ గ్రామాల్లో చదువుకున్న మహిళలు తక్కువగా ఉండటంతో పోస్టులు భర్తీ కావడం లేదు. ఫలితంగా ఇన్‌చార్జీలతో నెట్టుకురావాల్సి వస్తోంది. ప్రస్తుతం అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేయాలంటే కనీస అర్హత ఇంటర్‌తో నోటిఫికేషన్ విడుదల చేస్తారనే సమాచారం. విద్యార్హత కలిగి లేని గ్రామాల్లో మళ్లీ ఖాళీలు ఏర్పడే అవకాశం ఉంది. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీల భర్తీ విషయమై ఐసీడీఎస్ పీడీ భాస్కర్‌ను వివరణ కోరగా.. పోస్టుల భర్తీకి సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు అందలేదని స్పష్టం చేశారు. ఉత్తర్వులు రాగానే పత్రిక ప్రకటన జారీ చేస్తామన్నారు. జిల్లాలోని ఐదు ప్రాజెక్టుల వారీగా టీచర్లు, ఆయా పోస్టుల ఖాళీల వివరాలను సంక్షేమశాఖ కమిషనర్‌కు పంపించామని వెల్లడించారు.

అంగన్‌వాడీ టీచర్ పోస్టుల ఖాళీలు

ప్రాజెక్టు	మొత్తం పోస్టులు	విధుల్లో ఉన్నవారు	ఖాళీలు
ఆసిఫాబాద్	260	235	25
కాగజ్‌నగర్	173	166	7
సిర్పూర్(టి)	202	197	5
జైనూర్	175	151	24
వాంకిడి	163	126	37
మొత్తం	973	875	98

హెల్పర్ పోస్టుల ఖాళీలు

ప్రాజెక్టు	మొత్తం పోస్టులు	విధుల్లో ఉన్నవారు	ఖాళీలు
ఆసిఫాబాద్	260	186	74
కాగజ్‌నగర్	173	143	30
సిర్పూర్(టి)	202	170	32
జైనూర్	175	88	87
వాంకిడి	163	115	48
మొత్తం	973	702	271

ఉద్యోగాలు భర్తీ చేయాలి



జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీలు వెంటనే అర్హులైన అభ్యర్థులతో భర్తీ చేయాలి. ఏళ్లుగా అంగన్‌వాడీ కేంద్రాలల్లో సిబ్బంది లేక గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సరైన పౌష్టికాహారం అందడం లేదు. ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయాలి.

– బోగే ఉపేందర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి

క్లుప్తంగా

వర్షాలకు కూలిన ఇల్లు



లక్ష్మణచాంద: మండలంలోని పీచర గ్రామంలో ఆదివారం ఇల్లు కూలింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అల్లేపు మల్లేశ్ ఇల్లు కూలిందని, ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితుడు మల్లేశ్ కోరారు.

ఈత చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు



చికిత్స పొందుతున్న రాజాగౌడ్

నెన్నెల: మండలంలోని చిన్నవెంకటాపూర్‌కు చెందిన గీత కార్మికుడు పోతునూరి రాజాగౌడ్ ఆదివారం ఈత చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. వెన్నుపూసకు తీవ్ర గాయమైందని వైద్యులు హైదరాబాద్‌కు రిఫర్ చేయగా కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. క్షతగాత్రుడిని ప్రభుత్వం ఆదుకుని పరిహారం అందజేయాలని గీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు కొయ్యడ మల్లాగౌడ్ కోరారు.

కొండచిలువ పట్టివేత



అడవిలో వదులుతున్న యువకుడు

తానూరు: మండలంలోని సింగన్‌గాం గ్రామ సమీపంలో లక్ష్మణ్ పోతన్నకు చెందిన సోయా పంటలో ఆదివారం భారీ కొండ చిలువ కనిపించింది. పంటలో పనులు చేస్తుండగా కూలీలు, రైతులు చూసి పరుగులు తీశారు. వెంటనే పాములు పట్టే సహభాజీకి ఫోన్‌లో సమాచారం అందించారు. ఆయన అక్కడికి చేరుకుని కొండ చిలువను పట్టుకుని అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.

వాటర్ ట్యాంకు పైనుంచి పడి వ్యక్తి మృతి



మల్లేశ్ మృతదేహం

జైపూర్: మండలంలోని షెట్‌పల్లి గ్రామానికి చెందిన గోలాడ మల్లేశ్ (37) వాటర్ ట్యాంకుపై నుంచి పడి మృతి చెందగా ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..మల్లేశ్ గోదావరి నదిలో చేపలు పడుతూ జీవనం సాగిస్తున్నాడు. మూడు నెలల కిందట భార్య సుమలత పుట్టింటికి వెళ్లింది. అప్పటినుంచి మద్యానికి బానిసయ్యాడు. వారం రోజులుగా మద్యం తాగుతున్నాడు. రెండురోజుల క్రితం గ్రామంలో వాటర్ ట్యాంకు ఎక్కే క్రమంలో కింద పడిపోయి మృతి చెందాడు. ఆదివారం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత



పట్టుబడిన పశువులు

రెబ్బెన: మహారాష్ట్రలోని ధనోరా నుంచి లారీలో నిజామాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న పశువులను పట్టుకున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మండలంలోని పుంజుమేరగూడ వద్ద జాతీయ రహదారి వద్ద ఆదివారం పెట్రోలింగ్ చేస్తుండగా పక్కా సమాచారంతో ఆసిఫాబాద్ వైపు నుంచి వస్తున్న లారీని ఆపి తనిఖీ చేస్తే 20 ఎద్దులు, 15 ఆవులు ఉన్నాయి. పశువులను తరలిస్తున్న వ్యక్తులను విచారించగా మహారాష్ట్రలోని గడ్‌చందూర్‌లోని సాధిక్ చెందిన పశువులను లారీలో తరలిస్తున్నట్లు ఒప్పుకున్నారు. సాధిక్‌తోపాటు లారీ డ్రైవర్ మహ్మద్ హతం, క్లీనర్ సయ్యద్ వాహిబ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పట్టుకున్న పశువులను కాగజ్‌నగర్‌లోని గోశాలకు తరలించి, లారీని సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

శ్రీ విజయలక్ష్మి సోషల్ వెల్ఫేర్ సొసైటీ, కుమురం భీం జిల్లా

తేది: 14-09-2024 నాటి ఔట్ సోర్సింగ్ ఉద్యోగ సవరణ ప్రకటన

తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ సొసైటీ (TMREIS) ఆధ్వర్యంలో కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని మైనారిటీ గురుకుల సంక్షేమ పాఠశాల/ కళాశాలలలో వివిధ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలకు ప్రకటనలో సవరణలో భాగంగా వయస్సు: 18 సం॥ల నుండి 44 సం॥ల వయస్సు గల అభ్యర్థులు మాత్రమే అర్హులుగా చదువుకోగలరు. ఇతర వివరాలకు తేది: 14-09-2024 నాటి సాక్షి జిల్లా పత్రిక ప్రకటనను చూడండి.

శ్రీ విజయలక్ష్మి సోషల్ వెల్ఫేర్ సొసైటీ, సెల్: 90303 97084, 63046 61259


రక్షిద్దాం.. రక్షించుకుందాం

- క్షీణిస్తున్న ఓజోన్ పొర
- పర్యావరణహిత కార్యక్రమాలతోనే పరిరక్షణ
- నేడు ప్రపంచ ఓజోన్ దినోత్సవం

ఆదిలాబాద్: మానవ చర్యల మూలంగా ప్రకృతి విధ్వంసానికి కారణమవుతున్నాడు. భూమిని సూర్యుడి నుంచి వచ్చే అతినీల లోహిత కిరణాల నుంచి రక్షిస్తున్న ఓజోన్ పొరపై పరోక్షంగా దాడి చేస్తూ, దాని ఉనికిని ప్రశ్నార్థకం చేస్తున్నాడు. చివరికి తన మనుగడకు ముప్పు కొని తెచ్చుకుంటున్నాడు. భూమిపై గల వాతావరణ పొరల్లో స్ట్రాటో స్పియర్లో వాయురూపంలో విస్తరించి ఉండే ఓజోన్ పొర క్షీణత జీవజాలంపై పెను ప్రభావం చూపుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని దాని పరిరక్షణ ధ్యేయంగా ఏటా సెప్టెంబర్ 16న ప్రపంచ ఓజోన్ దినోత్సవం జరుపుకొంటున్నాం. ఈ సందర్భంగా సాక్షి కథనం.



ఆదిలాబాద్ జిల్లాలోని అటవీ ప్రాంతం



2024 ఓజోన్ డే థీమ్

ఉమ్మడి జిల్లా అటవీ ముఖచిత్రం..
ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా 2021 నివేదిక ప్రకారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా.. తెలంగాణలోని అత్యధిక అటవీ విస్తీర్ణాన్ని కలిగి ఉంది. 5,743.40 చదరపు కి.మీ మేర (35.66 శాతం) అడవులు విస్తరించి ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా 54.41 శాతంతో కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రథమ స్థానంలో ఉండగా, మంచిర్యాల 45.15, ఆదిలాబాద్ 42.79, నిర్మల్ 32.62 శాతాలతో తర్వాతి స్థానాల్లో నిలిచాయి. అత్యధిక అటవీ విస్తీర్ణంతో ఉమ్మడి జిల్లా ఓజోన్ పునరుద్ధరణకు పరోక్ష కారణమవుతోంది.

ఓజోన్ అంటే..
భూమిని ఆవరించి ఉన్న వాతావరణ పొరల్లో ఓజోన్ అనేది 16 నుంచి 55 కి.మీ మేర విస్తరించి ఉన్న స్ట్రాటో స్పియర్లో ఉంటుంది. భూమి చుట్టూ ఆవరించి ఉండే మొదటి పొర ట్రోపోస్పియర్లోని ఆక్సిజన్(O_2) అణువులు రూపాంతరం చెంది స్ట్రాటోస్పియర్లో O_3 అణువులుగా మారుతాయి. ఈ O_3ని ఓజోన్ వాయువుగా వ్యవహరిస్తారు. ఈ అణువులన్నీ ఓజోన్ పొరగా ఏర్పడతాయి. సూర్యుడి నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాలు భూమిపై చేరకుండా అడ్డుకుంటాయి. ఈ విధంగా భూమిపై ఉన్న జీవజాలానికి ఎలాంటి నష్టం కలగకుండా ఓ రక్షణ కవచంలా ఓజోన్ పొర ఉంటుంది. అయితే మనిషి అనాలోచిత చర్యలతో ఓజోన్ పొరకు రంధ్రాలు ఏర్పడుతుండడం కలవరపాటుకు గురిచేస్తోంది.

ప్రధాన కారణాలివే..
ఓజోన్ పొర సన్నగిల్లడానికి ప్రధాన కారణంగా క్లోరోఫ్లోరో కార్బన్లు (సీఎఫ్‌సీ) నిలుస్తున్నాయి. వీటి వల్ల మానవాళికే కాకుండా సమస్త జీవరాసులపైన తీవ్ర ప్రభావం పడుతున్నాయి. రిఫ్రిజిరేటర్, ఏసీలు వంటి వాటిల్లో వినియోగిస్తున్న సీఎఫ్‌సీలు, హైడ్రో సీఎఫ్‌సీలు వాతావరణంలో పేరుకుపోయి స్ట్రాటోస్పియర్లో గల ఓజోన్‌తో చర్య పొంది ఆ అణువులను విడగొట్టి ఆక్సిజన్‌లా మారుస్తున్నాయి. పొరలో O_3 అణువులు O_2 వాయువుగా మారుతుండడంతో ఓజోన్ పలుచబడుతోంది. పంటలపై చల్లే స్ప్రే, ఫోమ్, డిటర్జెంట్లు, ప్లాస్టిక్ వస్తువుల తయారీ, రిఫ్రిజిరేటర్ల తదితర వినియోగంతో క్లోరోఫ్లోరో కార్బన్లు వాతావరణంలోకి విడుదలవుతున్నాయి. అదే విధంగా బ్రోమిన్ సైతం ఓజోన్ పొరను ఛిద్రం చేయడంలో ప్రధాన పాత్ర పోషిస్తుంది.

అనేక దుష్పలితాలు..
ఓజోన్ పొర క్షీణిస్తుండడంతో అతినీలలోహిత కిరణాలు భూమిపైకి చేరుతున్నాయి. దీంతో మనుషుల్లో చర్మ సంబంధ వ్యాధులు, రోగ నిరోధక శక్తి తగ్గడం, కంటి సంబంధ వ్యాధులు, చర్మ, క్యాన్సర్ బారినపడే అవకాశం ఉంది. జంతువులపై ఇవి మరింత తీవ్ర పరిణామాలు చూపుతున్నాయి. అలాగే మొక్కల్లో కిరణజన్య సంయోగ క్రియ రేటు తగ్గి మొక్కల ఆహార తయారీలో ఆటంకాలు ఏర్పడే అవకాశాలు ఉంటాయి. సముద్ర జీవజాలంపై పరోక్షంగా ఈ ప్రక్రియ ప్రభావితం చూపిస్తుందని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. ఉష్ణోగ్రతలు పెరిగి, భూమి అగ్నిగోళంలా మారుతుందనే హెచ్చరికలు లేకపోలేదు.

బీసీ కమిషన్ సభ్యురాలికి సన్మానం



లక్ష్మిని సన్మానిస్తున్న నాయకులు

నిర్మల్‌టౌన్: తెలంగాణ బీసీ కమిషన్ సభ్యురాలు, ఓయూ జేఏసీ నేత రంగు బాల లక్ష్మిని ఆదివారం హైదరాబాద్‌లో నిర్మల్‌కు చెందిన గౌడజన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు శాలువా కప్పి సత్కరించారు. తెలంగాణ ఉద్యమకారిణి లక్ష్మిని బీసీ కమిషన్ సభ్యురాలిగా నియమించడం హర్షనీయమని కొనియాడారు. నాయకులు అమరవేణి నర్సాగౌడ్, అనుములభాస్కర్ తదితరులు ఉన్నారు.

ఇంట్లో చోరీ

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని మహాలక్ష్మివాడకు చెందిన మద్దుల రాకేశ్ ఇంట్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో గుర్తుతెలియని దుండగులు చొరబడి రూ.10వేల నగదుతోపాటు గ్యాస్ సిలిండర్‌ను ఎత్తుకెళ్లినట్లు బాధితుడు టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు.

పంటల సాగుపై రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

బెల్లంపల్లిరూరల్: పంటల సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాల (పొలాస) జగిత్యాల విద్యార్థులు అన్నారు. మండలంలోని ఆకెనపల్లిలో గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా పంటల సాగుపై రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. పీపీఈ కిట్లు, చేతులకు గ్లౌజులు ధరించి పొలాల్లో రసాయనిక మందులు, ఎరువులు పిచికారి చేయాలన్నారు. పిచికారి అనంతరం మందు డబ్బాలను భూమిలో పాతి పెట్టాలన్నారు. అధిక మోతాదులో రసాయనిక ఎరువులు పిచికారి వల్ల దిగుబడి తగ్గుతుందని తెలిపారు. రైతులు వ్యవసాయ శాఖ, కృషి విజ్ఞాన కేంద్రం అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ అధిక దిగుబడి పొందాలన్నారు. విద్యార్థులు తిరుపతి, శ్రీధర్, పవన్, మణిదీప్, నవతేజ్, నరేశ్, రైతులు పాల్గొన్నారు.

వేర్వేరు కారణాలతో పలువురు ఆత్మహత్య



ఓర్సు రాజు (ఫైల్)

బావిలో దూకిన వ్యక్తి..
గుడిహత్నూర్: ఉమ్మడి జిల్లాలో వేర్వేరు కారణాలతో పలువురు ఆత్మహత్య చేసుకున్నారు. బోథ్ మండలం కౌఠ గ్రామానికి చెందిన ఓర్సు రాజు (39) అనారోగ్య సమస్యలతో బాధపడుతూ జీవితంపై విరక్తితో వ్యక్తి బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. రాజు 15 ఏళ్ల క్రితం గుడిహత్నూర్‌కు చెందిన లలితను వివాహం చేసుకుని ఇక్కడే స్థిరపడ్డాడు. భార్యాభర్తలు ఇద్దరూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. వీరికి ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిలో చిన్నవాడు పుట్టుకతో దివ్యాంగుడు కావడంతో రాజు తరచూ బాధపడేవాడు. దీనికితోడు రాజుకు అనారోగ్య సమస్యలు తలెత్తాయి. తీవ్ర మనస్తాపంతో శనివారం రాత్రి గుడిహత్నూర్‌లోని వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై బలిరాం పేర్కొన్నారు.

జీవితంపై విరక్తితో ఒకరు..
కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని సర్‌సిల్క్‌కాలనీకి చెందిన అశోక్ యాదవ్ జీవితంపై విరక్తితో ఆదివారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణ ఎస్సై సుధాకర్ కథనం ప్రకారం..అశోక్ యాదవ్ (42) గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తితో ఇంట్లో ఉరేసుకున్నాడు. మృతుడి భార్య సరస్వతి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఉరేసుకుని ఒకరు..
భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామానికి చెందిన ఎర్రన్న ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..ఎర్రన్న (40) మద్యానికి బానిసై ప్రతీరోజు కుటుంబ సభ్యులతో గొడవపడేవాడు. శనివారం భార్య హంసతో గొడవకు దిగాడు. ఆమె మనస్తాపంతో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబీకులు భైంసా ఏరియాస్పత్రికి తరలించారు. ఆదివారం చికిత్సపొందుతున్న భార్య హంస వద్దకు వచ్చి మరోసారి గొడవపడి ఇంటికి వెళ్లాడు. హంస చీరలను తగులబెట్టి సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. మృతుడి కుమారుడు మహేశ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అడ గ్రామంలో వివాహిత..
ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని అడ గ్రామానికి చెందిన వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై రాజేశ్వర్ కథనం ప్రకారం.. ఆదివారం మధ్యాహ్నం హుడే గంగుబాయి (28) బట్టలు ఉతకడానికి వెళ్లి ఇంటికి ఆలస్యంగా వచ్చింది. ఎందుకు ఆలస్యమైందని భర్త లక్ష్మణ్ అడగడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఆ తర్వాత భర్త బయటకు వెళ్లాడు. తిరిగివచ్చే సరికి భార్య ఇంట్లో దులానికి ఉరేసుకుంది. గంగుబాయి తండ్రి దేవాజీ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

18న కలెక్టరేట్ ఎదుట ధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న బ్రహ్మానందం

నస్పూర్: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో ఈ నెల 18న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయనున్నట్లు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.బ్రహ్మానందం తెలిపారు. శ్రీరాంపూర్‌లోని యూనియన్ కార్యాలయంలో ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం శ్రీరాంపూర్ ఏరియా కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మానందం మాట్లాడుతూ తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా అమలు చేస్తున్న ప్రమాద, సహజ మరణ, శాశ్వత, పాక్షిక అంగవైకల్యం వంటి నాలుగు పథకాలను ప్రభుత్వం ఇన్సూరెన్స్ కంపెనీలకు టెండర్ల ద్వారా అప్పగించే ప్రయత్నాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశా రు. డిమాండ్ల సాధనకు జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 23న చలో హైదరాబాద్ కార్యాక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. భవన నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో నేదురి నర్సయ్య, మంతెన లక్ష్మయ్య, సుగుణ, లక్ష్మి, విజయ తదితరులు పాల్గొన్నారు.

తనయుడి చేతిలో తండ్రి హతం

- చికిత్స పొందుతూ మృతి
- ఆస్తిపంపకం విషయమై గొడవ

ఉట్నూర్‌రూరల్: ఆస్తి కోసం తనయుడు తండ్రిని హతమార్చిన ఘటన మండలంలోని రాజన్నగూడెంలో చోటుచేసుకుంది. ఎస్సై మనోహర్ కథనం ప్రకారం ..రాజన్నగూడెనికి చెందిన భాగ్యవాన్..ఆస్తి పంపకం విషయమై తండ్రి భూమన్న (65)తో గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయమై గత ఆగస్టులో తండ్రితో గొడవపడి దాడి చేశాడు. తండ్రి ఫిర్యాదుతో స్థానిక పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. మూడు రోజుల క్రితం తనయుడు ఇనుప రాడ్‌తో తండ్రి ముఖంపై దాడి చేయగా గాయపడ్డాడు. స్థానికులు అతన్ని ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. మెరుగైన వైద్య ం కోసం హైదరాబాద్‌కు తరలించారు. చికిత్సపొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పత్తిలో పిండినల్లి

- కాండం, కొమ్మలను పీల్చే పురుగు
- నివారణ చర్యలతోనే అరికట్టవచ్చు



పత్తిని ఆశించిన పిండినల్లి



పత్తి పంట

చెన్నూర్‌రూరల్: పత్తి పంటల్లో చీడపీడను ఆశించే పిండినల్లి పురుగులు ప్రధానమైంది. ఆగస్టు నుంచి అక్టోబర్ వరకు ఈ పంటలకు పురుగులు ఆశిస్తుంటాయి. ఇవి చిన్నవిగా ఉండి మెత్తగా, లేత గులాబీ రంగులో ఉంటాయి. పత్తి కొమ్మలు, కాండం, మొగ్గలు కాయల నుంచి రసాన్ని పీల్చుతాయి. దీని ద్వారా మొక్కల్లో సాధారణంగా జరిగే ఆవశ్యక మూలకాలు, పదార్థాల సరఫరాలో అంతరాయం ఏర్పడి మొక్కలు ఎదగక గిడసబారిపోతాయి. కణుపుల మధ్య దూరం తగ్గి మొక్క గుబురుగా చిన్నదిగా కనిపిస్తుందని, దీని నివారణకు చర్యలు చేపట్టాలని ఏవో మార్క్‌గ్లాడ్‌స్టన్ సూచిస్తున్నారు.

పిండినల్లి ఆశించే విధానం..
పిండినల్లి పురుగులు..పొలంగట్లపై అలాగే పనికిరాని భూముల్లో పెరిగే కలుపు మొక్కల ద్వారా వ్యాపిస్తాయి. బెండ, టమాట, వంగ, క్యాబేజీ, బొప్పాయి, నిమ్మ, జామ, మందార, గోగు, చామంతి, గడ్డి చామంతి, రామబాణం, వయ్యారిభామ, తుత్తర బెండ, సీతాఫలం, సుబాబుల్, గ్లెరిసిడియా వంటివి పిండినల్లికి అతిథి మొక్కలు. అధిక సంతానోత్పత్తి, అల్ప జీవితకాలం, ఈ పురుగు సాధారణంగా ఏడాదిలో 15 తరాలకు అభివృద్ధి చెందగలదు. ఆడ పురుగు పెట్టే ఒక గుడ్ల సంచిలో దాదాపు 600 వరకు గుడ్లు ఉంటాయి. పొలంలో సహజంగా పెరిగే మిత్ర పురుగులు అంతరించిపోవడంతో పురుగు విసర్జించే తేనె వంటి ద్రవం కోసం వచ్చే చీమల ద్వారా ఒక మొక్క నుంచి మరో మొక్కకు పురుగు వ్యాపిస్తుంది. ఈ పురుగు..పంట ఉత్పత్తులు, పత్తి కర్రల ద్వారా గాలి, నీటి కాలువలు, వర్షం, పక్షులు, పశువుల ద్వారా వ్యాపిస్తుంది.

నివారణ చర్యలు..
పిండినల్లి పురుగులు మొదటగా గట్ల పక్కన ఉండే పత్తి వరుసల్లో అక్కడక్కడ ఆశించి తర్వాత మిగతా మొక్కలకు వ్యాపిస్తాయి. ఈ దశలో పురుగు ఆశించిన మొక్కలను పీకి కాల్చివేయాలి. ఇలా చేయడం ద్వారా దాని విస్తరణను అదుపులో ఉంచవచ్చు. పొలం గట్లపైన ఉండే కలుపు మొక్కలు ముఖ్యంగా వయ్యారిభామ, తుత్తురబెండ, గడ్డిచామంతి, తదితర కలుపు మొక్కలను పీకి కాల్చివేయాలి. జైగోగ్రామ బైకోలరేట్ మిత్ర పురుగులను హెక్టార్‌కు 500–1000 వరకు విడుదల చేయాలి. తద్వారా వయ్యారిభామ, కలుపు మొక్కలను నివారించవచ్చు. దీని ద్వారా పిండినల్లి ఉధృతి తగ్గించవచ్చు. పత్తి ఏరిన తర్వాత ఎండు కర్రలను పీకి కాల్చివేయాలి. వేసవి దుక్కులు ద్వారా నేలలో దాగి ఉండే పిల్ల పురుగులను నియంత్రించవచ్చు. అంతర పంటగా అలసంద, బబ్బెర, సోయాబీన్, మినుము తదితర పంటలను సాగు చేయడం ద్వారా మిత్ర పురుగుల సంఖ్యను ఏ వృద్ధి చేయవచ్చు. కంచె పంటగా లేదా రక్షక పంటగా రెండు వరుసల సజ్జ లేదా కందులను దట్టంగా పెంచాలి. దీని ద్వారా పత్తిలో పిండినల్లి ఉధృతి తగ్గించుకోవచ్చును. మొక్కలను పురుగు ఆశించినట్లయితే లీటరు నీటిలో 10 మి.లీ వేపనూనెతోపాటు ఒక గ్రాము సబ్బు పొడిని కలిపి 10 నుంచి 12 రోజుల తేడాతో మొక్క కాండం, కొమ్మలు, ఆకులపై అలాగే చుట్టుపక్కల మొక్కలపైన పిచికారి చేయాలి. మోనోక్రోటోపాస్ నీరు 1:4 నిష్పత్తిలో కలిపిన ద్రావణాన్ని పంట విత్తిని 20, 40, 50 రోజుల వ్యవధిలో మొక్కల లేత కాండాలపై బ్రష్‌తో పిచికారి చేసినట్లయితే పిండినల్లిని సమర్థవంతంగా అరికటవచ్చు. తద్వారా మంచి దిగుబడి పొందవచ్చు.

జైనూర్‌కు వెళ్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అరెస్టు



డీఎస్పీతో మాట్లాడుతున్న ఎంపీ, ఎమ్మెల్యే

ఉట్నూర్‌రూరల్: జైనూర్ ఘటనలో బాధితులను పరామర్శించేందుకు ఆదివారం వెళ్తున్న ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, బీజేపీ నేతలను ఉట్నూర్ ఎక్స్‌రోడ్డు వద్ద పోలీసులు అరెస్టు చేశారు. ప్రజాప్రతినిధులుగా వెళ్తున్న తమకు అనుమతి ఇవ్వాలని కోరగా నిషేధాజ్ఞల నేపథ్యంలో అనుమతి లేదని డీఎస్పీ నాగేందర్, సీఐ మొగిలి స్పష్టం చేశారు. ఎంపీ, ఎమ్మెల్యే వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, జాతీయ నాయకులు రితేశ్ రాథోడ్, కొండేరి రమేశ్, నాయకులు రవీందర్, కౌన్సిలర్ ప్రవీణ్, అశోక్‌రెడ్డి, గణేశ్ తదితరులు ఉన్నారు.

ఎన్‌సీసీ కేడెట్లు దేశసేవ చేయాలి

ఆదిలాబాద్: ఎన్‌సీసీ కేడెట్లు దేశసేవ చేయాలని ఉమ్మడి జిల్లా ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ వికాస్‌శర్మ అన్నారు. జిల్లాకేంద్రంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో తెలంగాణ 32 బెటాలియన్ సీఏటీసీఐ శిక్షణ శిబిరాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 23వ తేదీ వరకు ఎన్‌సీసీ క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ క్యాంపులో ఉమ్మడి జిల్లాకు చెందిన 600 మంది కేడెట్లు పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో ఏఎన్‌వోలు జగ్గరాం, గాలి అశోక్, స్వామి, పూర్ణచందర్, రజిత, రాజేశ్వరి, శ్రీనివాస్, సాయినాథ్, వినోద్, ఉమేష్ కుమార్ పాల్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు అధికారులను మోసం చేసిన వ్యక్తి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ బన్సీలాల్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు అధికారులను మోసం చేసిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ బన్సీలాల్ తెలిపారు. పోలీసుస్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ మేరకు వివరాలు వెల్లడించారు. గతనెల 3న గుర్తుతెలియని వ్యక్తి మాస్క్ ధరించి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు వచ్చి క్యాష్ కౌంటింగ్ మిషన్ రిపేర్ చేస్తానని చెప్పి రూ.50 వేలు నగదుతో పారిపోయాడు. బ్యాంక్ మేనేజర్ ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. సీఐతోపాటు ఎస్సై వినిత సీసీసీ ఫుటేజీ ఆధారంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిందితుడు రోహిత్ బాబులాల్ ప్రకాశ్‌కాలేను ఆదివారం పట్టుకున్నారు. నిందితుడు మహారాష్ట్రలోని యావత్మాల్ జిల్లా పని గ్రామానికి చెందిన వ్యక్తి. కుటుంబ సభ్యులతో కలిసి గతకొన్నేళ్లుగా సికింద్రాబాద్‌లో ఉంటున్నాడు. గతంలో క్యాష్ కౌంటర్ మిషన్లు, ప్రింటింగ్, జిరాక్స్ మిషన్లు రిపేరు చేసేవాడు. కొంత కాలంగా జులాయిగా తిరుగుతుండేవాడు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో మెదక్, మంచిర్యాల హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో అధికారులను నమ్మించి మోసాలకు పాల్పడుతున్నాడు. మంచిర్యాలలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు వచ్చి క్యాష్ కౌంటింగ్ మిషన్ రిపేరు చేసినట్లు చేసి అధికారులను కౌంటింగ్ నిమిత్తం రూ. 50వేలు ఇవ్వాలని అడిగి వాటితో పరారయ్యాడు. ఈ మేరకు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

నిండుగా 'ఎల్లంపల్లి'

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎల్లంపల్లి పూర్తిస్థాయి నీటిమట్టంతో జలకళ సంతరించుకుంది. ప్రస్తుతం ప్రాజెక్టు మొత్తం 20.175 టీఎంసీలకుగాను 20.175 టీఎంసీల నీటి సామర్థ్యంతో ఉంది. ఎగువ నుంచి 15 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ఔట్‌ఫ్లో కింద 5 గేట్లు తెరిచి 14 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులున్నారు. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ పథకానికి 305 క్యూసెక్కులు, ఎన్టీపీసీకి 121 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు.



పూర్తిస్థాయి నీటిమట్టంతో ఎల్లంపల్లి జలాశయం